ప్రభుత్వ ఆసుపత్రులపై నిర్లక్ష్యం !

● ఉప్పల్, ఘట్‌కేసర్ ఆసుపత్రుల్లో బెడ్‌ల సంఖ్య పెంచినా.. ఫలితం శూన్యం

● సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాల్లో సిబ్బంది కొరత

పేదలకు గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలతో సహా పల్లె, బస్తీ దవాఖానాల్లో కూడా వైద్యం అందని ద్రాక్షలా తయారైంది. డాక్టర్లు, సబ్‌స్టాఫ్ కొరత, నిర్వహణ కారణంగా రోగులకు మరింత శాపమవుతోంది.

– సాక్షి, సిటీబ్యూరో



మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని పలు పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని కేంద్ర ఆసుపత్రిని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా మార్చారు. దీంతో ఇక్కడ ఉన్న వైద్యులు, సిబ్బందిని ఇతర ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు వైద్యారోగ్యశాఖ వినియోగిస్తోంది.

కాగితాలకే పరిమితం..

ఘట్‌కేసర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకలకు పెంచగా.. మేడ్చల్ ఆసుపత్రి 50 పడకలు, శామీర్‌పేట పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేస్తూ.. ఆరు పడకల నుంచి 30 పడకలకు పెంచారు. ఈ ఆసుపత్రుల అప్‌గ్రేడ్లు కాగితాలకే పరిమితమయ్యాయనే విమర్శలున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, డీసీహెచ్‌ఎస్‌లు మాత్రం ప్రస్తుతం ఉన్న వైద్యులు, సిబ్బందితోనే వైద్య సేవలను అందిస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న 31 ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 20 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 70 పల్లె దవాఖానాలు, 112 బస్తీ దవాఖానాలు కూడా స్థానిక రోగులకు అరకొర వైద్యసేవలనే అందిస్తున్నాయి.

విభిన్న పార్టీల నాయకుల ప్రాతినిధ్యం..

అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టగా.. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో మాత్రం విచిత్రమైన రాజకీయ పరిస్థితి నెలకొంది. జిల్లాలోని 5 అసెంబ్లీ స్థానాలను బీఆర్‌ఎస్ చేజిక్కించుకుంది. మల్కాజిగిరి ఎంపీ స్థానంలో బీజేపీ గెలుపొందింది. జిల్లాలోని విచిత్రమైన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అధికార యంత్రాంగం కూడా ఆసుపత్రుల అభివృద్ధి, అప్‌గ్రేడ్‌లపై సరిగ్గా స్పందించలేని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోంది.

● జిల్లా కాంగ్రెస్‌లో మాజీ ఎమ్మెల్యేలు, మాజీ జెడ్పీచైర్మన్ తదితర నాయకులు కీలకపాత్ర నిర్వహిస్తున్నప్పటికీ, ప్రభుత్వ ఆసుపత్రుల అప్‌గ్రేడ్, అభివృద్ధి విషయాలను ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సంబంధిత వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లలేకపోతున్నారు. దీంతో ప్రభుత్వాసుపత్రుల అభివృద్ధి ఒకడుగు ముందుకు, మూడడుగులు వెనక్కి చందంగా మారింది. ఇప్పటికైనా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రితో సహా స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, అప్‌గ్రేడ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులతో సహా పారా మెడికల్, ల్యాబ్ టెక్నీషియన్లు, సబ్‌స్టాఫ్, నర్సుల పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో 3 వేల మంది ఆశావర్కర్లు పనిచేయాల్సి ఉండగా.. 340 మంది మాత్రమే ఉన్నారు. అప్‌గ్రేడ్ చేసిన ఘట్‌కేసర్, ఉప్పల్, మేడ్చల్, శామీర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు కొత్తగా నిర్మించనున్న కూకట్‌పల్లి ఆసుపత్రిపై ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

సమయ పాలనపై..

మేడ్చల్, మల్కాజిగిరిజిల్లాలోని పలు గ్రామీణ, అర్బన్ ఆరోగ్యకేంద్రాలు, ప్రభుత్వాసుపత్రుల్లో సమయానికి రాని డాక్టర్లు, సిబ్బందితో రోగులు పడుతున్న ఇబ్బందులపై జిల్లా వైద్యారోగ్యశాఖ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సాధారణ జబ్బులు, సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు రోగులకు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

'రౌండ్ ది క్లాక్' ఆసుపత్రుల్లో..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 24 గంటలు (రౌండ్ ది క్లాక్) ఆసుపత్రులు 12 ఉండగా.. ఇందులో 4 ఆసుపత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో లేకపోవటం, మరికొన్నింటిలో ఆలస్యంగా రావడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రులకు వచ్చిన రోగులకు అవసరమైన మందులు లేకపోవడంతో రోగాలు నయంకావడం లేదని ఆందోళన చెందుతున్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం



పోచారం: ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవతా సహిత రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం అమ్మవారి కల్యాణమహోత్సవం నిర్వహించారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ ఈగ లలితాక్రిష్ణముదిరాజ్, ఆలయ ధర్మకర్తలు ఈగ నందిని రాము, లాస్యమధుముదిరాజ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, బీ– బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ బాలేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

రాజీవ్ యువ వికాస్ దరఖాస్తుల పరిశీలన



శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలానికి చెందిన రాజీవ్ యువ వికాస్ దరఖాస్తులను వివిధ కార్పొరేషన్ల అధికారులు మంగళవారం పరిశీలించారు. మూడుచింతలపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఈ దరఖాస్తులను ఎంపీడీవో గీతారెడ్డి పర్యవేక్షణలో క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీనియర్ అసిస్టెంట్ సంజయ్, జూనియర్ అసిస్టెంట్ హైదర్, బీసీ, ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్ల ప్రతినిధులు శ్రీహర్ష, లక్ష్మణ్‌రాజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


దేవేందర్‌రెడ్డి (ఫైల్)

మేడ్చల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం రాంరెడ్డి బావి గ్రామానికి చెందిన సామల దేవేందర్‌రెడ్డి (37) వరికోత మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై మండలంలోని రాయిలాపూర్ నుంచి రాంరెడ్డి బావికి వెళ్తుండగా.. బండమాదారం సబ్‌స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి అదృశ్యం


కిరణ్‌కుమార్

మేడ్చల్: ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రానికి చెందిన తోట కిరణ్‌కుమార్ (22) కండ్లకోయలోని ప్రియాంక హాస్టల్‌లో ఉంటూ కండ్లకోయలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ 3 సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 11న ఇంటికి వస్తున్నానని కుటుంబసభ్యులకు తెలిపి, ఇంటికి వెళ్లలేదు. దీంతో వారు ఆచూకీ కోసం హాస్టల్, కళాశాల తదితర చోట్ల వెతికినా అభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌టవర్‌లోని బ్యాటరీలు చోరీ

పోచారం: సెల్‌టవర్‌లోని బ్యాటరీలు చోరీకి గురైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొర్రెముల్‌లోని సెల్‌టవర్‌లో 24 బ్యాటరీలు ఈనెల 8న కనిపించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించారు. బ్యాటరీల విలువ సుమారు రూ. 1లక్ష ఉంటుందని సమాచారం. దీనిపై సెక్యూరిటీ సూపర్‌వైజర్ ధార అజయ్‌కుమార్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

పోచారం: ఓ మహిళ అదృశ్యమైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్ర నరేష్ (30), భార్య నయా అలియాస్ సుమ (28) చౌదరిగూడలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. కాగా భార్య ఎవరికీ తెలియకుండా మరో మొబైల్ ఫోన్ వాడుతోంది. ఈనెల 3న భర్త గమనించి మందలించాడు. మరుసటి రోజు రాత్రి సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

కమిషనర్‌కు సమ్మె నోటీసు !



మేడ్చల్: దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొంటారని సీఐటీయూ మండల కన్వీనర్ నరేష్ అన్నారు. మున్సిపల్ కార్మికులు ఈనెల 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటారన్నారు. నాయకులు కార్మికులతో కలిసి మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి మంగళవారం సమ్మె నోటీసును అందజేశారు. దేశంలోని అన్ని రంగాల కార్మికులు ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఎస్.మల్లేష్, ఎం.మల్లేష్, లక్ష్మారెడ్డి, రాజు, స్వామి, సురేష్, రవి, శ్రీనివాస్‌రెడ్డి, కె.రవి, రమేష్ తదితరులున్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

మేడ్చల్: పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం మంగళవారం నిర్వహించిన పాలిసెట్ పరీక్ష మేడ్చల్‌లో ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలో 8 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా.. 1798 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై పరీక్షలు రాశారు. 2078 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా.. 280 మంది పరీక్షలు రాయలేదు. మేడ్చల్‌లోని గిర్మాపూర్ పాలిటెక్నిక్ కళాశాల, స్ఫూర్తి, ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల, హైటెక్, హైటెక్ మోడ్రన్, ఎస్ఎస్‌జీ, ఆక్స్‌ఫర్డ్, ఢిల్లీ వరల్డ్ పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని అధికారులు ప్రకటించారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు


రైతులతో మాట్లాడుతున్న జిల్లా మేనేజర్ సుగుణబాయి

ఘట్‌కేసర్: ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ సుగుణబాయి అన్నారు. ఏదులాబాద్, మాదారంలో జిల్లా పౌరసరఫరాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ధాన్యం కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన ధాన్యం వర్షానికి తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు విక్రయించిన ధాన్యం డబ్బులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన..

కీసర: కీసరలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మేడ్చల్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరాంరెడ్డి, కీసర మండల వ్యవసాయాధికారి మాధవిలత మంగళవారం సందర్శించారు. వడ్లను తడి, దుమ్ము లేకుండా ఆరబెట్టి మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. వరికోత సమయంలో వరినూర్పిడి యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించారు. పలువురు అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

ఘట్‌కేసర్: విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏదులాబాద్‌లోని మీరాల రామయ్య తన రెండు పాడి గేదెలను రోజూ మాదిరిగానే మంగళవారం మేతకు తీసుకెళ్లాడు. సమీపంలోని సాగునీటి కాల్వలో తోటకూర మల్లేష్, పోచయ్యలు నీరు తరలించడానికి మోటర్లు ఏర్పాటు చేశారు. వరికోతలు ముగిసినప్పటికీ మోటార్లకు ఫీజులు తీయకపోవడంతో విద్యుత్ అలాగే సరఫరా అవుతోంది. గేదెలు కాలువలో నీళ్లు తాగేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. రూ. 2 లక్షల విలువైన గేదెలు మృతి చెందడంతో బాధిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బోడుప్పల్: 7వ డివిజన్ పరిధిలోని ఆంజనేయనగర్ కాలనీలో రూ. 55 లక్షలతో చేపట్టనున్న రోడ్డు పనులను మంగళవారం మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర పాలక సంస్థ పరిధిలో పెండింగ్ ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు కృషి చేస్తామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ.. పనులు చేపట్టాలని అధికారులు, కాంట్రాక్టర్లను కోరారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బి– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సుమన్‌నాయక్, 7వ డివిజన్ ఇన్‌చార్జి హరినాథ్‌రెడ్డి, కాలనీ మాజీ అధ్యక్షుడు ఫణికిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బీజేపీ నేత మృతి

మల్లాపూర్: నాచారంకు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు అంపాల పద్మారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. గతంలో నాచారం డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా పోటీచేసి ఓడిపోయారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, నాచారం కార్పొరేటర్ శాంతి, మాజీ మేయర్ కార్తీకరెడ్డి నివాళులర్పించారు.

భూ భారతికి 35 దరఖాస్తులు


గోధుమకుంటలో భూభారతి రెవెన్యూ సదస్సు

కీసర: భూ భారతి రెవెన్యూ సదస్సులో భాగంగా గోధుమకుంట గ్రామంలో నిర్వహించిన సదస్సులో మంగళవారం 35 దరఖాస్తులను స్వీకరించినట్లు కీసర ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో భూభారతి పైలెట్ ప్రాజెక్టులో భాగంగా గ్రామసభలు పూర్తైనట్లు ఆయన తెలిపారు. మొత్తం 1054 దరఖాస్తులు అందినట్లు వివరించారు. వీటన్నింటిని ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ ఉన్నతాధికారుల ఆదేశానుసారం నిర్దేశిత సమయంలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.

మద్యం మత్తులో కుటుంబసభ్యులపై దాడి !

మేడ్చల్: మద్యం మత్తులో ఓ వ్యక్తి తన కుటుంబసభ్యులపై వంటగదిలో ఉన్న కత్తితో దాడిచేసి, తాను ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన మేడ్చల్ మండల పరిధిలోని నూతన్‌కల్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సైలేందర్ అంబాదే(47) తన కుటుంబంతో కలిసి నూతన్‌కల్‌లో నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసైన అతడు రాత్రి మద్యం సేవించి ఇంట్లో గొడవపడ్డాడు. ఈ క్రమంలో వంటిల్లో ఉన్న కత్తితో కుమార్తె హన్సాస్ (12) అత్త రూమాన్‌సహారె(68)ల చేతులపై దాడిచేసి గాయపరిచాడు. వారు కేకలు వేయడంతో అదే కత్తితో మెడ కోసుకుని, పైనుండి దూకాడు. గాయపడిన వారు స్థానిక ఆసుపత్రిలో చికిత్స తీసుకుని తిరిగి ఇంటికి వెళ్లారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌తో పేదలకు చేయూత


లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట్: సీఎం రిలీఫ్‌ఫండ్ నిరుపేదలకు చేయూతనందిస్తుందని మాజీమంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలం, అలియబాద్ గ్రామానికి చెందిన గండికోట ప్రసాద్ సీఎంరిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరైంది. కాగా మంగళవారం రూ.33వేల చెక్కును లబ్ధిదారుడికి ఎమ్మెల్యే మల్లారెడ్డి అందజేశారు. శామీర్‌పేట మాజీ జెడ్పీటీసీ అనిత, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్‌కు యత్నం.. కేసు నమోదు !

పోచారం: ఇటీవల ప్రేమించి వివాహం చేసుకున్న యువతిని కిడ్నాప్ చేసేందుకు యత్నించిన వ్యక్తులపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాద్రి టౌన్‌షిప్‌కు చెందిన మేడికంటి రామ్మూర్తి (25) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విజయపురి కాలనీలోని ప్రిన్‌స్టన్ కాలేజీలో వడ్ల అమృత (19) బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రామ్మూర్తి, అమృత ఇద్దరు ప్రేమించుకుని ఈనెల 5న వివాహం చేసుకున్నారు. చౌదరిగూడలోని వెంకటాద్రి టౌన్‌షిప్‌లో రామ్మూర్తి తల్లిదండ్రులతో వీరు కలిసి ఉంటున్నారు. కాగా మంగళవారం అమృత సోదరుడు నితిన్, ఆమె తల్లి రజిత, మరికొందరు వ్యక్తులు రామ్మూర్తి ఇంట్లోకి ప్రవేశించి అమృతను కిడ్నాప్ చేసేందుకు యత్నించారు. అడ్డుకున్న రామ్మూర్తి, అతడి తల్లిదండ్రులపై దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపరచడమే లక్ష్యం

● గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి సైదులు


వేసవి శిక్షణ శిబిరంలో గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి సైదులు

కీసర: విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపరచడమే లక్ష్యమని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అన్నారు. కీసరలోని బాలికల గురుకుల విద్యాసంస్థలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. బీసీ విద్యార్థులకు విద్యతో పాటు అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇలాంటి వేసవి శిక్షణ శిబిరాలతో విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడల్లో ఆసక్తి పెరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 294 బీసీ గురుకుల పాఠశాలల నుంచి 2539 మంది విద్యార్థులు ఈ వేసవి శిక్షణ శిబిరాల్లో శిక్షణ పొందారని తెలిపారు. ప్రముఖ మౌంటెరియన్ పూర్ణ మాలావత్, ఎంజేపీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ తిరుపతి, హైదరాబాద్ ఆర్‌సీవో ఆదిత్యవర్మ, రంగారెడ్డి ఆర్‌సీవో వెంకటేశ్వర్‌రెడ్డి, కీసర పాఠశాల ప్రిన్సిపాల్ రాములుగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి


గౌతంనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని మిర్జాలగూడ చిన్మయిమార్గ్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వరదముంపునకు గురౌతున్న చిన్మయ్ మార్గ్‌లో వరదనీరు సజావుగా వెళ్లేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. అనంతరం హనుమాన్‌పేటలోని రైల్వేలైన్ కిందనుంచి కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (వెంట్)ని ఎమ్మెల్యే పరిశీలించారు. మల్కాజిగిరి ఏసీపీ శ్రీనివాస్, డీఈ లౌక్య, ఏఈ దివ్యజ్యోతి, నాయకులు జేఏసీ వెంకన్న, మేకల రాముయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి రిమాండ్


నిందితుడు సాల్మాన్ రాజు

ఉప్పల్: ఇంటి ముందు, గేటు లోపల పార్క్ చేసిన సైకిళ్లను దొంగిలిస్తున్న వ్యక్తిని ఉప్పల్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడలో నివాసం ఉండే సుంచు సాల్మాన్ రాజు (46) స్వగ్రామం కర్నూల్ వీకర్ సెక్షన్ హనుమాన్‌టెంపుల్. కాగా బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి చోరీల బాటపట్టాడు. మంగళవారం రామంతాపూర్ డీమార్టు ముందు సైకిల్‌పై తిరుగుతూ.. అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అర్ధరాత్రి దాటిన తర్వాత కాలనీల్లో గేటు లోపలకి వెళ్లి విలువైన సైకిళ్లను దొంగిలించేవాడు. గతంలో ఉప్పల్ బ్యాంక్‌కాలనీ, బాలాజీ ఎన్‌క్లేవ్, సాయిరాంనగర్, ధర్మపురి కాలనీ, పలు ప్రాంతాల్లో సైకిళ్లను దొంగిలించాడు. కీసర, కుషాయిగూడ, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్లలో సైకిళ్ల దొంగతనాలకు పాల్పడి పోలీసులకు దొరికి జైలుకు సైతం వెళ్లొచ్చాడు. అనంతరం సాల్మాన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'


రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు


మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

మేడ్చల్: రైతులకు అధునాతన వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం మండలంలోని గోసాయిగూడ గ్రామంలో వ్యవసాయాధికారులు ఆచార్య జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో కలిసి పర్యటించారు. రైతులతో కలిసి శాస్త్రవేత్తలు, అధికారులు కలిసి పొలాలు తదితర చోట్ల సమావేశం నిర్వహించి చీడపీడల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఉద్యాన పంటలపై తీసుకోవాల్సిన మెళకువలను తెలియజేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ సుదాంశ్, స్వామి, మానస, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు, ఏఓ అర్చన, ఏఈఓ తేజస్విని వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

కీసరలో..

కీసర: కీసరలోని రైతు వేదికలో కీసర మండల వ్యవసాయాధికారి మాధవీలత ఆధ్వర్యంలో మంగళవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి, సీడ్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ మాధవీలత హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. వరి పంటలో కాండం తొలుచు పురుగు, పురుగు మందు అవశేషాలు లేని పంట ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. డాక్టర్ సందీప్‌కుమార్, ఎస్.విక్రమ్, నిహారిక, వెంకటరామిరెడ్డి, శ్వేత, పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలతోనే అధిక లాభాలు..

శామీర్‌పేట్: రైతులు వరికి బదులు కూరగాయలు పండించి అధిక లాభాలు పొందాలని శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన శామీర్‌పేట్, మురహరిపల్లిలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రసాయన ఎరువులైన యూరియా మోతాదుకు మించి వాడకూడదని, కూరగాయలు పండించి అధిక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. పంటమార్పిడిలో వివిధ రకాల పంటలను పండించాలని చెప్పారు. పచ్చిరొట్ట ఎరువులను వాడాలని దీంతో భూసారం పెరుగుతుందని స్పష్టం చేశారు. వరి పంటలో తెగుళ్లు, పురుగులను తట్టుకునే విత్తనాలను నాటాలని సూచించారు. డాక్టర్ ఆకుల బేబీ, లావణ్య, విజయలక్ష్మి, రంజిత, సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్యయాదవ్, శామీర్‌పేట వ్యవసాయాధికారి రమేష్, ఏఈఓ రవికుమార్, సుధీర్, సొసైటీ డైరెక్టర్ భూమిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.